# ఒరియా పత్రిక "సంబాద్"



విభిన్న ఆచారాల మధ్య, వివిధ భాషల మధ్య బలమైన సంస్కార సూత్రంతో ఒకటిగా మన గలుగుతున్న భారతదేశంలో తెలుగువారికి సరిహద్దు రాష్ట్రాలలో ఒకటి ఒరిస్సా. ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్.

ఒరిస్సాలోని ప్రముఖ దిన పత్రికలలో "ఈష్టరన్ మీడియా లిమిటెడ్" వారు స్థాపించిన "సంబాద్" దినపత్రిక ఒకటి.

ఆధునికమైన "అటాలజీ" కంప్యూటర్ అక్షరాల ఈ పత్రికకిఅధినేత,ఎడిటర్సౌమ్యరంజన్ పట్నాయక్. ఈయన యువకుడు, సామ్యవాది, ఉత్సాహవంతుడు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జె.బి. పట్నాయక్‌కి అల్లుడు.

1984 లో స్థాపింపబడిన ఈ పత్రిక కార్యాలయం భువనేశ్వర్‌లో నేషనల్ హైవే నెం. 5 పక్కన మూడు ఎకరాల స్థలంలో నిర్మింపబడింది. రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ శ్రీ ఎ.ఎన్. తివారీ ఈ పత్రిక చీఫ్ ఎగ్జిక్యూటివ్.

"మీ పత్రికలో సంపాదకీయాలు మీరే వ్రాస్తారా?" అన్న ప్రశ్నకి సమాధానంగా శ్రీ సౌమ్యరంజన్ పట్నాయక్ —

"అసలు మా పత్రికలో ఇంతవరకు సంపాదకీయాలే లేవు. మీరేమీ అనుకోకపోతే, సంపాదకీయాలకి నేను వ్యతిరేకిని. పాఠకులలో నూటికి ఇరవైమంది మాత్రమే చదివే ఈ సంపాదకీయాలు దండగ అని నా ఉద్దేశం. సంపాదకీయాలు సామాన్య పాఠకుడి మనస్సులో తిష్ఠవేసి, అతనికి తన సొంత అభిప్రాయాలు లేకుండా చేస్తాయి. అందుచేత నేను సంపాదకీయాలు వ్రాయను" అని అన్నారు.

"ప్రస్తుత పరిస్థితుల గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకోలేనివాళ్ళకి కాని, సొంత అభిప్రాయం ఏర్పరచుకోగోరే వాళ్ళకి కాని సంపాదకీయాలు మార్గదర్శకంగా వుంటాయి గదా, మీరిలా అంటారేమిటి?" అన్న ప్రశ్నకి సమాధానంగా నవ్వి, "ఏది ఏమైనా మరింకేదైనా ప్రజలకుపయోగించే శీర్షికకి ఆ జాగా ఉపయోగిస్తాము" అని అన్నారు.

తమ పత్రిక ప్రధానోద్దేశం లేదా పాలసీ ఒరిస్సా రాష్ట్ర ప్రగతి అనీ, ప్రజలలో పఠనాసక్తిని పెంపొందించడమనీ అన్నారు.

సర్క్యులేషన్ దృష్ట్యా ఏ పత్రికైనా సరిగ్గా నిలబడాలంటే దాదాపు ఏడెనిమిది లక్షల జనాభా వున్న నగరాలు ఎక్కువ వుండాలనీ, అట్లాంటి నగరాలు ఒరిస్సాలో తక్కువగా వుండడం వలన తాము తమ పత్రిక సర్క్యులేషన్‌కి గ్రామాల మీద కూడా ఎక్కువ భాగం ఆధారపడవలసి వస్తోందనీ, ఆ కారణంగా అనేక కలగాపులగపు శీర్షికలతో ఇంకా ఒక దారికి రాలేకపోతున్నామనీ అన్నారు.

ఉదయంవెలువడే ఈ సంబాద్ దిన పత్రిక కాక ఈ సంస్థ "కథ" అనే ఫిక్షన్ మాసపత్రిక, "ఫూల్ ఝురీ" అనే పిల్లల మాసపత్రిక, "పౌరుష్" అనే నవలా పత్రిక, "సహారా" అనే ఉర్దూ వారపత్రిక కూడా ప్రచురించి విడుదల చేస్తున్నారు.

ఒరిస్సా రాష్ట్రంలో సినిమా పరిశ్రమ బాగా తక్కువ. సినిమా హాళ్ళు కూడా తక్కువే! రాజధాని అయిన భువనేశ్వర్‌లోనే ఐదు సినిమా హాళ్ళ కన్నా ఎక్కువ లేవు. ఒరిస్సా రాష్ట్రం అంతా కలిపితే విజయవాడలో వున్నన్ని సినిమా హాళ్ళు కూడా వుండవేమో!

అయినా, ఈష్టరన్ మీడియావారు సాహసించి "సినీ సంబాద్" అని ఒక సినిమా మాసపత్రిక కూడా ప్రారంభించారు. ఇందులో ఎక్కువ భాగం హిందీ చిత్ర తారలే దర్శనమిస్తారు.

తాము త్వరలో రూర్‌కేలా, బెర్హంపూర్‌ల నుంచి కూడా ఎడిషన్లు ప్రారంభించనున్నట్లు శ్రీ సౌమ్యరంజన్ పట్నాయక్ తెలిపారు.

సంబాద్ కార్యాలయానికి కవి ఇస్మాయిల్, పురాణంగారు, ఆంధ్ర అసోసియేషన్ తాలూకు మిత్రులువచ్చారు.

—విశ్వనాథ పావనిశాస్త్రి

## కాలమ్ దాటని కథ

మెడికో శ్యాం పెళ్ళీడుకొచ్చాడు. మేనత్త కూతురు స్పందనని పెళ్ళి చేసుకొమ్మని శ్యాం అమ్మానాన్నలు చెప్పారు.

శ్యాం కూడా ఇంటర్ చదివే రోజుల్లో స్పందనని ప్రేమించాడు. అయితే మెడిసిన్‌లో చేరాక ఇంటర్‌తోనే చదువుకు స్వస్తిపలికిన స్పందనకి దూరంగా జరిగిపోయాడు.

స్పందనని పెళ్ళి చేసుకొమ్మని చెప్పిన అమ్మ నాన్నల నోరు తెరవనివ్వకుండా శ్యాం ఓ సైంటిఫిక్ పాయింట్ లేవదీశాడు. "స్పందన కళ్ళకి దృష్టి దోషం వుంది. ఆమె కళ్ళకి వున్న హ్రస్వదృష్టి దోషం ఆమెకు పుట్టే పిల్లలకి సైతం సంక్రమిస్తుంది. అద్దాలు వేసిన ఆమె - అద్దాల పిల్లలు - సంసారం పరమ ఛండాలంగా తయారవుతుంది" అని చెప్పి తప్పించుకున్నాడు.




బావ వింత వాదన చూసి స్పందన కళ్ళ నుంచి కన్నీళ్ళు జలజలా రాలాయి.

స్పందనని, అమ్మా నాన్నల్ని కాదని శ్యాం ఉమెన్స్ కాలేజ్ లెక్చరర్ శశిని (కళ్ళజోడు వేయని)ని పెళ్ళి చేసుకొన్నాడు.

శ్యాంకి పెళ్ళైన మూడేళ్ళకే వరుసగా ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. వారు ఎల్.కె.జి., యు.కె.జి.,లు చదివేనాటికే దూరంగా వున్న వస్తువులు కనిపించడం లేదని గోల చేశారు.

పిల్లల కళ్ళు పరీక్ష చేయించి కళ్ళజోళ్ళు ఇప్పించాలనే ఉద్దేశ్యంతో హైదరాబాదులో వున్న నేత్ర నిపుణుడి వద్దకి శ్యాం తన పిల్లల్ని తీసుకెళ్ళాడు.

అక్కడ భర్త రాందాసుతో వున్న స్పందన కనిపించింది. చూసీ చూడనట్లు వెళ్తున్న శ్యాంని చూసి నవ్వుకొంది స్పందన.

"దృష్టి దోషం పూర్తిగా నయమైంది మీకు, ఇకపై కళ్ళజోడు వాడాల్సిన అవసరం లేదు" అని చెప్పిన డాక్టర్‌కి లోలోనే థ్యాంక్స్ చెప్పుకొని, శ్యాంని తలచుకొని కొద్ది సేపు జాలిపడింది స్పందన.

—ఆర్.సి. కృష్ణస్వామి రాజు